ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 వరంగల్
సోమవారం 8 జనవరి 2024



నగరంలోని ఏవీవీ కళాశాలలో జరిగిన ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ఆకట్టుకున్న రంగవల్లులు

- ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన మహిళామణులు
- ముఖ్య అతిథిగా హాజరైన పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

వరంగల్ కలెక్టరేట్, జనవరి 7 : వరంగల్ జిల్లా కేంద్రంలోని ఏవీవీ కళాశాల మైదానంలో ఆదివారం 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ప్రతీ ఏటా ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తోంది. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి భారీగా మహిళలు తరలివచ్చారు. రంగులతో, ఆడపడుచుల సందడితో మైదానం కళకళ లాడింది. ముత్యాల ముగ్గులకు విశేష స్పందన లభించింది.

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన' రాష్ట్ర స్థాయి స్పాన్సర్లుగా ఉండగా, జిల్లాలోని నర్సంపేట పట్టణానికి చెందిన 10వ వార్డు కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్, ఎన్ఆర్ఐ సెల్ నర్సంపేట కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్‌లతో పాటు ఎన్ఆర్ఐ కె.కీర్తన లోకల్ స్పాన్సర్స్‌గా వ్యవహరించారు.

ఈ పోటీల్లో మహిళలు, యువతులు 45 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకే కళాశాల మైదానానికి చేరుకొని పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ ముగ్గుల పోటీలను మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి ప్రారంభించారు. స్వయంగా ముగ్గులు వేసి రంగులు అద్దారు. దీంతో కళాశాల ప్రాంగణమంతా రంగుల ముగ్గులతో సందడి నెలకొంది. మహిళలు తమ వెంట తెచ్చుకున్న ముగ్గులతో చుక్కలతో కూడిన అందమైన ముగ్గులను వేశారు. గౌరవ అతిథిగా జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి మాచర్ల శారద, గీసుగొండ ఎంపీపీ సౌజన్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నగరానికి చెందిన కార్పొరేటర్లు పోశాల పద్మ, పల్లం అరుణ, గుండు హరిచందన, జన్ను షిభారాణి, డాక్టర్ హరి రమాదేవి, మంథిని సునితలు, న్యాయ నిర్ణేతలుగా చందా భారతమాత, చందా జ్యోతి, వల్లాల శైలజతో పాటు ఏవీవీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమ్యాల శ్రీనివాసరావు, ప్రముఖ సైకాలజిస్టు బరుపాటి గోపి పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలు ముగ్గులను పరిశీలించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ముగ్గురితో పాటు మరో ఐదుగురిని కన్సోలేషన్ బహుమతులకు ఎంపిక చేశారు. కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవానికి వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

విజేతలకు బహుమతులు అందజేత

ఈ పోటీల్లో ప్రథమ బహుమతి(రూ.6వేలు)కి వరంగల్ నగరానికి చెందిన వెల్లంకి లావణ్య, ద్వితీయ బహుమతి(రూ.4వేలు)కి వరంగల్‌కు చెందిన మంచోజుల అనూష, తృతీయ బహుమతి (రూ.3 వేలు)కి వరంగల్‌కు చెందిన నందం నాగేశ్వరి ఎంపికయ్యారు. ఆయా విజేతలకు పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలతో పాటు గిఫ్ట్ ప్యాక్‌లు, షీల్డులను అందజేశారు. అలాగే మరో ఐదుగురికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. వారిలో చల్లోజు స్వాతి, మల్లం పద్మ, మల్లారపు అపర్ణ, కొత్త రమ్య, ఎస్.యోగితలకు ఒక్కొక్కరికి రూ.వేయి చొప్పున నగదు, షీల్డు, గిఫ్ట్‌లను అందజేశారు. కార్యక్రమానికి హాజరైన అతిథులు, పోటీల్లో పాల్గొన్న మహిళలందరికి గిఫ్ట్ ప్యాక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝాను ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ వి.రఘుపతిరావు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ కక్కెర్ల అనిల్‌కుమార్‌లు ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఎడిషన్ ఇన్‌చార్జి శెంకేసి శంకర్‌రావు, ఏడీవీటీ మేనేజర్ విజేందర్‌రెడ్డి, ఏబీఎన్ ఛానల్ స్టాఫ్ రిపోర్టర్ డి.నవీన్, డెస్క్ ఇన్‌చార్జి నరేందర్, రిపోర్టర్లు శివుడు, శ్రీనివాస్, సర్దార్, పవిత్రన్, రమేష్, ఉమేందర్‌గౌడ్, విజయ్, వడిచెర్ల శ్రీనివాస్, నందకిశోర్, పి.రాజన్న, భరత్, కందికొండ మోహన్, బజ్జూరి ప్రభాకర్, నరేష్, సర్క్యులేషన్ సిబ్బంది, ఏసీపీ బోనాల కిషన్, పోలీసు అధికారులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాల పరిరక్షణకు ఆంధ్రజ్యోతి కృషి : సీపీ అంబర్ కిశోర్ ఝా

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడానికి ప్రతీ ఏటా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చేస్తున్న కృషి అభినందనీయమని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. ఈ ముత్యాల ముగ్గుల పోటీల్లో అన్ని రంగాలకు చెందిన మహిళలు, యువతులు పాల్గొని రంగు రంగుల చుక్కల ముగ్గులు వేయడం తనను ఎంతో ఆకట్టుకుందన్నారు. సమాజానికి ఉపయోగపడే వారు కలిసి పాల్గొని నిర్వహిస్తున్న ఈ ముగ్గుల పోటీ ఆదర్శవంతమైన కార్యక్రమమని తెలిపారు.

మరో అతిథి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి మాచర్ల శారద మాట్లాడుతూ మహిళల కోసం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఏటా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. నగరానికి చెందిన కార్పొరేటర్లందరు మాట్లాడుతూ పత్రికా, మీడియా రంగంలో తనవంతు పాత్ర పోషిస్తూ, సంక్రాంతి పర్వదినం వెల్లి విరిసేలా ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయడం ఆనంద దాయకమని అన్నారు.



మొదటి బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత లావణ్య



రెండో బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత అనూష



మూడో బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత నాగేశ్వరి



ప్రథమ బహుమతి గెలిచిన ఎల్లంకి లావణ్యకు బహుమతి అందజేస్తున్న పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

అభివృద్ధిని ఆపే ప్రయత్నాన్ని మానుకోవాలి

- పనులపై ఎమ్మెల్యే దొంతి సమీక్ష నిర్వహించాలి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, జనవరి 7 : నర్సంపేట నియోజకవర్గంలో గతంలో శాఖల పరంగా వచ్చిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమీక్ష నిర్వహించాలని, అభివృద్ధి పనులను ఆపే ప్రయత్నాన్ని మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్ది మాట్లాడుతూ అభివృద్ధి పనులను కొనసాగించే దమ్ము, పనులపై సమీక్ష జరిపే ధైర్యం లేదా అని అన్నారు. గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన అభివృద్ధి పనులను ఆపే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని ఎమ్మెల్యే దొంతిని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ప్రజలకు గృహలక్ష్మి పథకం ద్వారా మంజూరై ప్రొసీడింగ్స్ వచ్చిన 2,783 ఇండ్లకు సంబంధించిన పనులను నిలిపివేయమనడం దారుణమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జీవో 346 ద్వారా రూ.75 కోట్లతో ప్రత్యేకంగా నర్సంపేట నియోజకవర్గానికి వ్యవసాయ యాంత్రీకరణ ప్రాజెక్టును తీసుకువచ్చినట్లు తెలిపారు. అందులో రూ.16 కోట్లు ఖర్చు చేయగా, మిగతా రూ.59 కోట్ల నిధులు వెనక్కి పోవడం దురదృష్టకరమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 6వేల మంది రైతులు లబ్ధి పొందారని, ఎక్కువగా లబ్ధి పొందింది కాంగ్రెస్ పార్టీ వారేనన్నారు. రైతులకు ఉపయోగపడే ఈ సబ్సిడీ పైలెట్ ప్రాజెక్టును ఆపేయాలని కుట్ర చేస్తున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నియోజకవర్గంలోని 1,100 మందికి దళితబంధు, 289 మందికి బీసీ బంధు చెక్కులు, 100 మందికి ముస్లిం మైనారిటీ చెక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆపి లబ్ధిదారుల నోట్లో మట్టికొట్టిందని పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం ద్వారా నెక్కొండ మండలంలో 500 మందికి కుట్టుమిషన్లు పంపిణీ చేశామని, మిగతా మండలాల్లో కూడా ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం తీసుకొచ్చిన నిధులను ఖర్చుచేసి నర్సంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. అభివృద్ధి నిధుల విషయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రాష్ట్ర మంత్రులను సంప్రదించి వెనక్కి పోయిన నిధులను మళ్లీ తీసుకొచ్చి నియోజకవర్గంలో అభివృద్ధిని కొనసాగించాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులను ఆపే ప్రయత్నం చేస్తే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపడతామని సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నాయకులు గుగులోతు రామస్వామి, నల్లా మనోహర్‌రెడ్డి, రాయిడి రవీందర్‌రెడ్డి, గుంటి కిషన్, దార్ల రమాదేవి, వేములపల్లి ప్రకాశ్‌రావు, రమేష్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ముసాయిదా ఓటరు జాబితా విడుదల

- ఈ నెల 20, 21 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ డే

వరంగల్ కలెక్టరేట్, జనవరి 7 : జిల్లాలో ఓటర్ల వివరాలకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాను కలెక్టర్ పి.ప్రావీణ్య విడుదల చేశారు. వాటి ప్రతులను, సీడీలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు పంపించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరి రివిజన్ 2024లో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న మొత్తం ఓటర్ల జాబితాను జనవరి 6న డ్రాఫ్ట్ పబ్లికేషన్ విడుదల చేయడం జరిగిందని అన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ రెండు రోజుల పాటు ప్రతీ పోలింగ్ బూత్‌లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలోని 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్లు ఓటు హక్కు కోసం పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 22 వరకు ఓటర్లకు సంబంధించిన వివరాలపై అభ్యంతరాలు స్వీకరణ ఉంటుందని తెలిపారు. జిల్లాలోని ఓటర్లకు సంబంధించిన ఫైనల్ జాబితా ఫిబ్రవరి 8న ఉంటుందన్నారు. వరంగల్ జిల్లాలో నర్సంపేట నియోజకవర్గంలో 283 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం ఓటర్లు 2,33,793 ఉన్నారని, వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 230 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం ఓటర్లు 2,57,228 ఓటర్లు ఉన్నారని, వర్ధన్నపేట నియోజకవర్గంలో 278 పోలింగ్ కేంద్రాలు ఉండగా 2,71,209 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ వివరించారు.

కమనీయం.. రమణీయం..

- వైభవంగా కొమురవెల్లి మల్లన్న కల్యాణం
- తిలకించి పులకించిన భక్తజనం
- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

చేర్యాల, జనవరి 7 : ముక్కోటి దేవతలు, పంచభూతాల సాక్షిగా, వీరశైవ పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయ ధ్వానాలు, మేళతాళాల చప్పుళ్లు, మంగళవాయిద్యాల నడుమ కొమురవెల్లి మల్లికార్జున స్వామి కేతలమ్మ, మేడలాదేవీలను వివాహమాడారు. సనాతన వీరశైవాగమశాస్త్రం ప్రకారం మార్గశిర మాసం చివరి ఆదివారం రోజును పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని తోటబావి ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై కమనీయంగా, రమణీయంగా కైంకర్యం నిర్వహించారు.

కల్యాణ క్రతువు..

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కొమురవెల్లిలో వీరశైవార్చకులు మల్లికార్జున స్వామి, కేతమ్మ, మేడలాదేవీల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తూ మహిళల కోలాటాల నడుమ బాజాభజంత్రీల మధ్య కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. వరుడు మల్లికార్జునస్వామి తరపున కన్యాగ్రహీతలుగా పడిగన్నగారి మల్లికార్జున్ దంపతులు, అమ్మవార్లు గొల్ల కేతమ్మ, మేడలాదేవీల తరపున కన్యాదాతలుగా మహదేవుని మనోహర్ దంపతులు వ్యవహరించారు. వేదికపై పట్టు వస్త్రాలతో ధగధగ లాడుతున్న దేవతామూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి కల్యాణ నిర్వహణ తీరు, విశేషాలను డాక్టర్ మహంతయ్య, షశిభూషణ సిద్ధాంతి చేసిన వ్యాఖ్యానం భక్తులను అలరించింది.



వేడుకలకు హాజరైన మంత్రులు కొండా సురేఖ, పొన్నం

పట్టువస్త్రాలు అందించిన మంత్రి కొండా సురేఖ

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందచేశారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. మాంగళ్యధారణ అనంతరం స్వామి వారిని దర్శించుకుని మల్లన్న ఆలయాన్ని సందర్శించారు. మంత్రి కొండా సురేఖ కుటుంబ సభ్యులతో కలిసి పట్నం వేసి మొక్కు తీర్చుకున్నారు.



దేవతామూర్తులకు తలంబ్రాలు పోస్తున్న వీరశైవార్చకులు

సంప్రదాయబద్ధంగా దృష్టికుంభం-బలిహారణ

తెల్లవారుజామున 4.30 గంటలకు గర్భాలయ మండపంలోని వీరభద్రుడికి బలిహారణ చేసి దృష్టికుంభాన్ని ఘనంగా నిర్వహించారు. వీరశైవార్చకులు అన్నంరాశులపై గుమ్మడికాయలు నెలకొల్పి దండకాలతో హోరెత్తించిన అనంతరం గుమ్మడికాయను బలిఇచ్చి స్వామి వారి తొలిదర్శనాన్ని ప్రారంభించారు. మల్లన్నకు చత్రకన్ను అమర్చి శతరుద్రాభిషేకం పూజలు నిర్వహించారు.


వనదేవతలకు ముందస్తు మొక్కులు

మేడారం, జనవరి 7 : తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క, సారలమ్మ వనదేవతలకు భక్తులు ముందస్తు మొక్కులు చెల్లిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు లక్షకు పైగా భక్తులు ఆదివారం తరలివచ్చారు. తల్లుల గద్దెల వద్ద పూలు, పండ్లు, చీరె, సారె, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు చేసి కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. అనంతరం గద్దెల వద్దకు చేరుకుని సమ్మక్క-సారలమ్మలకు జేజేలు పలుకుతూ శివసత్తుల పూనకాలతో బాజాభజంత్రీలతో తల్లుల గద్దెలకు


మిగతా 6వ పేజీలో..



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు









తాటిచెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తాటి చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

హసన్‌పర్తి శివారులో 19 మందికి గాయాలు



గాయపడ్డ ప్రయాణికులను 108 ద్వారా ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

హసన్‌పర్తి, జనవరి 7: అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు తాటి చెట్టును ఢీ కొన్న సంఘటన ఆదివారం రాత్రి హసన్‌పర్తి శివారులో జరిగింది. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ డిపోకు చెందిన బస్సు వరంగల్ నుంచి సిరిసిల్లకు వెళుతోంది. బస్సులో 55 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు హసన్‌పర్తి శివారులో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయింది. అదుపు తప్పిన బస్సు రోడ్డు.. పక్కనే ఉన్న తాటి చెట్టును ఢీ కొంది. దీంతో అందులో ప్రయాణిస్తున్న 19 మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, సబ్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌లు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డవారికి ప్రథమ చికిత్స చేసి, 108 ద్వారా మెరుగైన చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంగ్లీష్‌లో కవితకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, జనవరి 7: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం పరిశోధకురాలు ఎస్.కవితకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఆదివారం కవితకు డాక్టరేట్ ప్రకటించినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'థీమ్ ఆఫ్ డయాస్ పోరా ఇన్ ది నవెల్స్ ఆఫ్ అనిత రావ్ బాదమీ' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానిగాను డాక్టరేట్ ప్రకటించారు. కేయూ ఇంగ్లీష విభాగం ప్రొఫెసర్ వి. శ్రీనివాస్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. హనుమకొండ వడ్డెపల్లి ప్రభుత్వ మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో ఇంగ్లీష్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తారు.

ప్రభుత్వ పాలన శాస్త్రంలో శంకర్‌కు..

కాకతీయ యూనివర్సిటీ ప్రభుత్వ పాలన శాస్త్రం పరిశోధకుడు నిమ్మనగోటి. శంకర్‌కు డాక్టరేట్ లభించింది. 'ఇంప్లిమేంటేషన్ ఆఫ్ వెల్ఫేర్ మేజర్స్ అండ్ రెహబిలిటేషన్ స్కీమ్స్ ఫర్ విజుల్లీ డీస్సాబ్లెడ్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానిగాను డాక్టరేట్ ప్రకటించారు. కేయూ ప్రభుత్వ పాలనశాస్త్రం ప్రొఫెసర్ పింగళి నర్సింహరావు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం పరడ గ్రామానికి చెందిన శంకర్ కేయూలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

హనుమకొండ క్రైం, జనవరి 7: హనుమకొండ పోలీసుస్టేషన్ పరిధిలోని లష్కర్ సింగారంలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మస్సి తండాకు చెందిన బానోతు బాలాజీ హనుమకొండ లష్కర్ సింగారంలో ఉంటూ దినసరి కూలీగా పని చేస్తున్నాడు. ఆదివారం లష్కర్ సింగారంలోని ఇంటి ముందు పార్కింగ్ చేసి బయటకు వెళ్లి వచ్చాడు. ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ కనిపించకుండా పోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.



దామెర మండల కేంద్రంలో వేలిముద్రలు తీసుకుంటున్న రేషన్ డీలర్ (ఫైల్)

ఈ- కేవైసీకి నెలాఖరు గడువు

రేషన్ దుకాణాలకు పరుగులు.. కొనసాగుతున్న ప్రక్రియ

హనుమకొండ రూరల్, జనవరి 7: రేషన్ కార్డులోని కుటుంబ సభ్యులకు ఈ-కేవైసీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం గడువు విధించింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రేషన్‌కార్డు లబ్ధిదారులందరి వేలిముద్రలు సేకరించాలని రేషన్ డీలర్లకు ఆదేశాలు రావడంతో ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. రేషన్‌కార్డు ద్వారా పొందే బియ్యం దుర్వినియోగం అవుతున్నట్లు ప్రభుత్వాల దృష్టికి రావడంతో ఈ కేవైసీ తప్పనిసరి చేస్తూ ఆదేశించినట్లు తెలుస్తోంది. రేషన్‌కార్డులో పేరున్న ప్రతీ ఒక్కరు ఈ-పాస్ యంత్రాల ద్వారా వేలిముద్రలు డీలర్లు సేకరిస్తున్నారు. ఈ-కేవైసీ చేసుకోకుంటే బియ్యం ఇవ్వరనే వదంతులు వ్యాపించడంతో పెద్దఎత్తున రేషన్ దుకాణాలకు పరుగులు పెట్టారు. రేషన్ డీలర్లు బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 73శాతం ఈ- కేవైసీ పూర్తయినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

రేషన్ దుకాణాలకు పరుగులు

ఈ-కేవైసీ ఈనెల 31వ తేదీతో ముగుస్తుండటంతో ప్రజలు రేషన్ దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే చాలా మంది వేలిముద్రలు ఇవ్వగా.. ఇంకా ఇవ్వని వారు గడువు సమీపిస్తుండటంతో ఎలాగైనా ఈ-కేవైసీ చేయించుకోవాలనే ఉద్దేశంతో రేషన్‌దుకాణాల ముందు వేచి ఉంటున్నారు. రేషన్ కార్డుల్లోని చిన్నారులకు ఆధార్‌కార్డు లేకపోవడంతో ఆధార్ నమోదు సెంటర్లకు పరుగులు తీస్తున్నారు.

ఈ- కేవైసీ 73శాతం పూర్తి

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 414 రేషన్ దుకాణాలు ఉండగా రేషన్ కార్డులు 2,28,143 ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 2,16,767, అంత్యోదయ కార్డులు 11352, అన్నపూర్ణ కార్డులు 24 ఉన్నాయి. మొత్తం 6,75,550 లబ్ధిదారులు ఉండగా ఇందులో ఇప్పటి వరకు 4,92,693 మంది మాత్రమే ఈ-కేవైసీ చేయించుకున్నారు. ఇంకా 1,82,857 మంది రేషన్ కార్డుదారులు ఈ- కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు 73శాతం మంది ఈ- కేవైసీ చేయించుకున్నారు. మిగతావారు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్లకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు.

రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ చేసుకోవాలి :
జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పి.వసంతలక్ష్మీ

జిల్లాలోని రేషన్ కార్డుదారులు విధిగా ఈ-కేవైసీ చేసుకోవాలి. పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీ వరకు ఇవ్వడం జరిగింది. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ సమీపంలోని రేషన్ దుకాణాలలో వేలిముద్రలు (ఈ-కేవైసీ) ఇవ్వాలి. ఇప్పటి వరకు ఈ-కేవైసీ చేసుకోని లబ్ధిదారులు నెలాఖరులోగా పూర్తి చేసుకోవాలి.

కేయూ ఉద్యోగి మృతిపై ఉద్రిక్తత


మధుసూదన్ (ఫైల్)

- బిల్లులు రాలేదని ఒత్తిడితో మృతిచెందాడని బంధువుల ఆరోపణ
- మృతదేహాన్ని వర్సిటీకి తరలించి నిరసన.. వీసీ హామీతో విరమణ

కేయూ క్యాంపస్, జనవరి 7: కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగి మధుసూదన్ (49) గుండెపోటులో ఆదివారం మృతి చెందారు. రెండు రోజుల కిందట మధుసూదన్‌కు గుండెపోటుకు గురికాగా, హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతుండగానే పరిస్థితి విషమించి మృతిచెందాడు. దీంతో ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ప్రొఫెసన్ ఎన్. వాసుదేవారెడ్డి, ప్రొఫెసర్ బన్న అయిలయ్య, ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ మామిడాల ఇస్తారీలు హనుమకొండలోని పాత ఆర్టీవో ఆఫీస్ ప్రాంతంలో ఉన్న మృతుడి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉద్రిక్తత

మధుసూదన్ వర్సిటీలో ఉద్యోగం చేస్తూనే ఇటీవల కేయూ న్యాక్ పనుల్లో భాగంగా వర్సిటీకి కావాల్సిన ఫ్లెక్సీలు, ఇతర పనులు చేశారు. ఆయా బిల్లులు సుమారు రూ.20లక్షల మేరకు వర్సిటీ మధుసూదన్‌కు చెల్లించాల్సి ఉంది. అయితే రోజులు గడుస్తున్నప్పటికీ వర్సిటీ అధికారులు బిల్లులు ఇవ్వడం లేదని మానసిక ఆందోళనలతోనే మధుసూదన్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం మధుసూదన్ ఇంటికి వచ్చిన వర్సిటీ ఉన్నతాధికారులు ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. వర్సిటీ నుంచి మధుసూదన్‌కు రావాల్సిన డబ్బులను వెంటనే ఇప్పిస్తామని హామీఇచ్చారు. అయితే కుటుంబసభ్యులు తమకు స్పష్టమైన లిఖిత పూర్వకమైన హామీ కావాలని వర్సిటీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఒకటి., రెండు రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అయినా సంతృప్తి చెందక మధుసూదన్ మృతదేహాన్ని వర్సిటీ పరిపాలన భవనం ఎదుట ఉంచి నిరసన ఆందోళన చేసేందుకు వర్సిటీకి తరలించారు. అయితే పోలీసులు వెంటనే అప్రమత్తమై మృతదేహాన్ని వర్సిటీలోనికి తీసుకురాకుండా మొదటి గేటువద్ద అడ్డుకున్నారు. ఈ క్రమంలో మృతుడి బంధువులకు, పోలీసులతో వాగ్వాదం జరిగింది. చివరకు మధుసూదన్ మృతదేహంతో పరిపాలన భవనం ఎదుట నిరసనలకు దిగారు. దీంతో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు రంగంలోకి దిగారు. మధుసూదన్‌కు రావాల్సిన డబ్బులన్ని వెంటనే చెల్లిస్తామని ఫోన్‌లో కుటుంబసభ్యులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. మధుసూదన్ వైద్య ఖర్చుల కోసం ఇటీవల రూ.3 లక్షలు చెల్లించామని, మిగతా డబ్బులు సోమవారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సందర్శించిన తోటి ఉద్యోగులు

మధుసూదన్ మృతి విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నేతలు, వర్సిటీ కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు భారీగా తరలి వచ్చారు. అనంతరం పోచమ్మకుంటలోని హిందూ స్మశాన వాటికలో మధుసూదన్ అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, మృతుడికి భార్య కోమల, కూతురు మనస్విని, కొడుకు తేజలున్నారు.


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వర్సిటీ అధికారులు తాళ్లపల్లి మనోహర్, ప్రొఫెసర్ మల్లారెడ్డి తదితరులు


హనుమకొండలో జరిగిన ముగ్గుల పోటీలో ముగ్గులను పరిశీలిస్తున్న మహిళా పోలీసు అధికారులు, ఆంధ్రజ్యోతి సిబ్బంది

అలరించిన రంగవల్లులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో విజయవంతంగా ఏజిఎస్-ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు



మహబూబాబాద్‌లో కెనరా బ్యాంక్ మేనేజర్ శోభన్‌కు మెమెంటో అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్


మహబూబాబాద్‌లో లోగో ముగ్గులు వేసిన చిన్నారి సరెడ్డి సాయి స్ఫూర్తికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్


వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు


వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా


జనగామలో ముగ్గులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఆయన సతీమణి


జనగామలో లోకల్ స్పాన్సర్ 'శ్రీలక్ష్మీ షాపింగ్ మాల్' అధినేత భోగ కైలాసంను సత్కరిస్తున్న ఆంధ్రజ్యోతి బృందం


హనుమకొండలోని ముగ్గుల పోటీలో పాల్గొన్న చిన్నారులకు డిక్షనరీలను అందచేస్తున్న విక్రమ్ పబ్లిషర్ ప్రతినిధి శ్రీనివాస్


హనుమకొండలోని ముగ్గులో పోటీలో ప్రసంగిస్తున్న జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్


హనుమకొండలోని ముగ్గుల పోటీలో పాల్గొని ముగ్గులు వేస్తున్న చిన్నారులు


హనుమకొండలో మాట్లాడుతున్న కాజీపేట ట్రాఫిక్ సీఐ సుజాత


ములుగులో జరిగిన ముగ్గుల పోటీల సందర్భంగా మాట్లాడుతున్న మంత్రి సీతక్క


ములుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు


హనుమకొండలో జరిగిన ముగ్గుల పోటీల బహుమతి ప్రదానోత్సవంలో ప్రసంగిస్తున్న ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ వి.రఘుపతిరావు



ఆంధ్రజ్యోతి WARANGAL CITY 6

వరంగల్ సిటీ

● వరంగల్ ● ఖిలావరంగల్ ● గీసుగొండ ● సంగెం

సోమవారం 8 జనవరి 2024

లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

గీసుగొండ, జనవరి 7 : గీసుగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఏనుగుల సాంబరెడ్డిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే వైస్ చైర్మన్‌లుగా చాడా సంజీవరెడ్డి, కందికొండ చంద్రమౌళి, ప్రధాన కార్యదరిగ్గా కోల వేణు, కోశాధికారిగా బోడకుంట్ల రాజు, 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చాడా కొమురారెడ్డి, దౌడు భరత్, వరిగెల రాజు, దొనికెల నవీన్, రాములు, మేకల మోహన్, కోట అశోక్, వీరాటిసంజీవరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, తాటికొండ నరేందర్, కందికొండ మల్లేశం, సాంబయ్య, ములుక మార్కేండేయ, రామ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ సభ్యులు

జీటీఏ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న జీటీఏ రాష్ట్ర నూతన కార్యవర్గం

వరంగల్ సిటీ, జనవరి 7: ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం(జీటీఏ) రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆదివారం హైదరాబాద్ మౌలాలిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చెన్నూరి వెంకట విక్రమాదిత్య ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, రాష్ట్ర అధ్యక్షుడిగా కాసం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా మేరోజు బ్రహ్మాచారి, గౌరవాధ్యక్షుడిగా విశ్వనాథం గుప్త, అసోసియేట్ అధ్యక్షుడిగా తాళ్లపెల్లి ప్రకాశ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా అద్దంకి బుచ్చిరాములు, కోశాధికారిగా సపావట్ నర్సింహా, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సక్రునాయక్‌లను ఎన్నుకున్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు ప్రారంభం



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ జయుడు

ఏకశిలనగర్, జనవరి 7:వరంగల్‌లోని శాంతినగర్ రాజశ్రీ గార్డెన్స్‌లో ఆదివారం రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు ప్రారంభం అయ్యాయి. పర్ఫెక్ట్ పంచ్ కరాటే స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి డాక్టర్ జయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. కరాటే ఆత్మరక్షణకు అత్యంత విలువైన విద్య అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే విద్యతో పాటు కరాటే, క్రీడల్లో పాల్గొంటూ ప్రావీణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులతో పాటు పలువురు కరాటే మాస్టర్‌లు తమ ప్రదర్శనలను ఇచ్చారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్ 6వ డాన్ ఎం.రవి, న్యాయనిర్ణేత చంద్రశేఖర్, పోలీసు అకాడమీ కరాటే కోచ్ సుకేష్, కాసాని రవీందర్ యాదవ్, అమర్ చందు, వినయ్, గౌస్‌పాషా, సుమారు 500 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాతికేళ్ల తరువాత ఒకే వేదికపై నూతన విద్యానికేతన్ విద్యార్థులు

శంభునిపేట, జనవరి 7 : ఒకే పాఠశాలలో చదువుకొని పాతికేళ్ల తరువాత కలుసుకున్నారు. తమ అనుభూతులను పంచుకొని ఆనందంగా గడిపారు. వరంగల్‌లోని ఫించన్‌పూర్‌లో గల నూతన విద్యానిలయంలో 1998-99 విద్యా సంవత్సరం పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు పాతికేళ్ల తరువాత ఆదివారం కలుసుకున్నారు. ఖమ్మం రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వారి కుటుంబ నేపథ్యం, ఉద్యోగ, వ్యాపారాల గురించి తెలుసుకున్నారు. చిన్ననాటి స్నేహితులంతా ఒకే వేదికను పంచుకోవటం పట్ల ఆనందంగా ఉందని సంబురాలు చేసుకున్నారు. స్నేహితులందరం కష్టసుఖాల్లో సహాయ సహకారాలు అందించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిష్, నజీర్, శ్రీకాంత్, రవీందర్‌రెడ్డి, కిరణ్, రాణి, శ్రీలత, శిరీష, జ్యోతి, సుభాషిణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటరీకరణ ముమ్మరం

▸▸ 16లోగానే పూర్తి చేసే యత్నాలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 7: అభయహస్తం దరఖాస్తుల కంప్యూటరీకరణ చురుగ్గా కొనసాగుతోంది. మొత్తం నాలుగు కేంద్రాల్లో కంప్యూటరీకరణ జరుగుతోంది. దరఖాస్తులను పూర్తి చేసేందుకు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా చురుకైన పాత్రను పోషిస్తున్నారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలోని మొత్తం 66 డివిజన్ల నుంచి 2,86,820 దరఖాస్తుల స్వీకరణ జరిగింది. ఈ దరఖాస్తులన్నింటిని కంప్యూటరీకరణ చేసే ప్రక్రియ ఆదివారం నుంచే ఆరంభమైంది. జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయం, హనుమకొండలోని చైతన్య డిగ్రీ కళాశాల, వాగ్దేవి కళాశాల, తాళ్ల పద్మావతి కళాశాల మొత్తంగా నాలుగు కేంద్రాల్లో కంప్యూటరీకరణ జరుగుతోంది. ఈ నెల 16లో గానే దరఖాస్తుల నమోదు పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నారు.

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అభయహస్తం దరఖాస్తుల కంప్యూటర్ నమోదు ప్రక్రియలో చురుకైన పాత్రను పోషిస్తున్నారు. రెండు రోజులకు ముందుగానే ఆయన అధికారులు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. దరఖాస్తుల నమోదుపై దిశా, నిర్దేశం చేశారు. నగర పరిధిలోని నాలుగు కేంద్రాలను ఎంపిక చేసి బల్దియా అధికారులు, ఉద్యోగులతో పాటు డేటాఎంట్రీ ఆపరేటర్ల సేవలు వినియోగించే చర్యలను రిజ్వాన్ బాషా చేపట్టారు. నమోదు ప్రక్రియను ఈనెల 16లో గానే పూర్తి చేయాలనే లక్ష్యంతో కళాశాలల్లోని కంప్యూటర్లను అధిక సంఖ్యలో సమకూర్చారు. అంతే కాకుండా నమోదు ప్రక్రియను పరిశీలించేందుకు జీడబ్ల్యూఎంసీ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు ఎన్ని దరఖాస్తుల నమోదు జరుగుతుందనే వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు.



అభయహస్తం దరఖాస్తుల కంప్యూటరీకరణలో ఉద్యోగులు

జూనియర్ ఎన్టీఆర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

కరీమాబాద్, జనవరి 7 : జూనియర్ ఎన్టీఆర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆదివారం 39వ డివిజన్ కార్పొరేటర్ సిద్దం రాజు ఆవిష్కరించారు. అసోసియేషన్ స్టేట్ కన్వీనర్ పంజా రాంబాబు ఆధ్వర్యంలో వరంగల్‌లోని జన్మభూమి జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాజు క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల శివ, సునిల్‌యాదవ, క్రాంతి, శ్రీకాంత్, పరమేశ్వర్, శంకర్, నర్సింగరావు, బాలు, రాజు, శ్యాం, కోటి, కిరణ్, సాంబరాజు, రంజిత్, రాజు, వివేక్, సాయికుమార్, కిరణ్, రాజు, హరీష్, కార్తీక్, అఖిలేష్, సన్ని తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రాజు

జాతీయ మహా సభలను జయప్రదం చేయాలి

చెన్నారావుపేట, జనవరి 7: విప్లవ పార్టీల ఐక్యత జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నర్సంపేట డివిజన్ కార్యదర్శి అద్దూరి రాజు అన్నారు. ఆదివారం మండలంలోని ఈర్యతండాలో సీపీఐ (ఎంఎల్) పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. నరేంద్ర మోదీ చేస్తున్న కుల, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు.

బీఆర్ఎస్‌కు ఎల్గూరు రంగంపేట నేతల రాజీనామా

▸▸ ఎమ్మెల్యే రేవూరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

సంగెం, జనవరి 7 : మండలంలోని ఎల్గూరు రంగంపేట గ్రామ సర్పంచ్ పోతుల ప్రభాకర్ బీఆర్ఎస్ పార్టీకి షాక్ ఇచ్చారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. ఇంతకాలం బీఆర్ఎస్‌లో కొనసాగిన ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో గ్రామానికి చెందిన నాయకులు వెంట నడిచారు. పార్టీలో చేరిన వారిలో గ్రామ మాజీ సర్పంచ్ పెద్దగోని లక్ష్మీనారాయణగౌడ్, ఎల్గూరురంగంపేట చెరువు మత్స్యశాఖ మాజీ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్, బోనాల సతీష్, బండెల ఉప్పలయ్య బండెల ఐలయ్య, కడారి వంశీ, గడ్డం రవీందర్‌గౌడ్‌తో పాటు పలువురు చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, సంగెం సొసైటీ డైరెక్టర్ జనగాం రమేష్, చింతలపల్లి గ్రామ సర్పంచ్ ఇండ్ల రవికుమార్, మండల నాయకులు అచ్చ నాగరాజు, బోగి రవి, రావుల సదానందం పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్ ప్రభాకర్

నేటి బల్దియా ప్రజావాణి రద్దు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 7: వరంగల్ మహానగర పాలక సంస్థ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు అయ్యింది. ప్రజా పాలనలోని అభయహస్తం దరఖాస్తుల కంప్యూటరీకరణ విధుల్లో అధికారులు, ఉద్యోగులు ఉండడం వల్ల రద్దు చేసినట్లు కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఫిర్యాదుల కోసం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయానికి రావద్దని కమిషనర్ సూచించారు.

వంజరపల్లిలో ఉచిత వైద్య శిబిరం

సంగెం, జనవరి 7 : మండలంలోని వంజరపల్లి గ్రామంలో వరంగల్‌కు చెందిన సన్‌లైఫ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండీ డాక్టర్ అనంతుల అన్వేష్ ఆధ్వర్యంలో ప్రజలకు వైద్యం చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రస్తుత సమయంలో కరోనా వ్యాప్తి జరుగుతుందని, మాస్కులు ప్రతీ ఒక్కరు ధరించాలని సూచించారు. వైద్య శిబిరంలో 5వేల మంది రోగులకు మందులు అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంతల స్రవంతి అనిల్, మాజీ సర్పంచ్ కౌడగాని శంకర్‌రావు, యుగేందర్, శ్రీనివాస్, సాంబయ్య రవీందర్, రాజిరెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ



ఎస్టీయూ క్యాలెండర్, డైరిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

వరంగల్‌సిటీ, జనవరి 7: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను జిల్లాలోని వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. ఆదివారం హనుమకొండలోని ఎమ్మెల్యేల నివాసాల్లో క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశరెడ్డి చేతుల మీదుగా క్యాలెండర్, డైరీలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు యాట సదయ్య, వధులిమాయే, నాగరాజు, రాంబాబు, రవి, సుధాకర్‌రెడ్డి, మనోహరి, రమేష్, గణపతి, కిషన్, శేషాచారి, నిరంజన్, శివకోటి, రమేష్, కిషన్, మహేందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సంగెం, జనవరి 7 : సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ గోవింద్ చౌహాన్ అన్నారు. మండలంలోని పోచమ్మతండా, వీఆర్ఎన్ తండాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా సంక్షేమపథకాలను సమాజంలోని అట్టడుగు స్థాయికి తీసుకువెళ్లేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీసీ బొజ్జ సురేష్, సర్పంచ్‌లు గుగులోతు బిచ్యానాయక్, రమాదేవిలతో పాటు పలువురు పాల్గొని ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలి

▸▸ హైకోర్టు మాజీ న్యాయమూర్తి నరసింహరెడ్డి ▸▸ గ్రామ గ్రామాన అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ







గవిచర్లలో రాముల వారి అక్షింతలు వితరణ చేస్తున్న నరసింహరెడ్డి, అక్షింతలు తీసుకెళ్తున్న సాయినగర్ కాలనీవాసులు, గంగదేవిపల్లిలో రాముడి అక్షింతల పంపిణీ

సంగెం, జనవరి 7 : గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి లింగాల నరసింహరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గవిచర్ల గ్రామంలో అయోధ్య రాముల వారి అక్షింతలను ఇంటింటికి తిరిగి స్వయంగా వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో రామమందిరం నిర్మాణంతో దేశ ప్రజల్లో మరింత భక్తిభావం పెరిగి ప్రపంచ శాంతికి దోహద పడుతుందన్నారు. దేవున్ని పూజించడం వలన మానసిక సంతృప్తి కలిగి మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొనికెల రమ శ్రీనివాస్, బుట్టి కుమారస్వామి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన సాయినగర్ కాలనీ..

శంభునిపేట : నగరంలోని రంగశాయిపేట ఆదివారం రామనామ స్మరణతో మార్మోగింది. ఆలయంలో పూజారి శ్రీధరాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. సాయినగర్‌కాలనీ వాసులు భక్తి శ్రద్ధలతో రంగశాయిపేట రామాలయం నుంచి అయోధ్య రాముడి అక్షింతలను తీసుకెళ్లారు. అనంతరం రామకీర్తనలతో భక్తి శ్రద్ధలతో అక్షింతలను కాలనీలోని ఇంటింటికి పంపిణీ చేశారు. మహిళలు కోలాటాలు, పిల్లల నృత్యాలతో కడు రమణీయంగా సాగిన ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రామానుజన్ జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు మెంతుల వెంకటేశ్వర్లు, బొల్లోజు కృష్ణమూర్తి, బొల్లబోయిన మల్లికార్జున్, నారదాసు చందర్, బండారి సోమయ్య, డాక్టర్ బొమ్మెర కుమారస్వామి, ఎదులాపురం నరసింహచారి, జనగాం మల్లికార్జున్, పూజారి రాజేశ్వర్‌రావు, అనుమాండ్ల ప్రభాకర్, లక్ష్మీనారాయణ, మల్లారెడ్డి, పాకాల కుమార్, పద్మశ్రీ, వాణిశ్రీ, రజిత, సరస్వతి, విద్యావతి, రాధిక, సరిత, రమ, సుశీల, పల్లవి, అనిత, శ్రీలత పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

గీసుగొండ : అయోధ్య రామజన్మభూమి ఆలయ భూమిపూజ అక్షింతలను జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిలో ఆదివారం ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్య శ్రీరామ మందిరంలో శ్రీ బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని, ఆ రోజు సీతారాముల అక్షింతలను తలపై వేసుకొని పూజించాలని సర్పంచ్ గోనె మల్లారెడ్డి తెలిపారు. ఆ రోజు గ్రామదేవత కూడలి వద్ద ప్రొజెక్టర్ ద్వారా ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారం ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనజాగరణ సమితి సభ్యులు మాడిశెట్టి రాముడు, బాలరాజు, ఐలయ్య, సాంబరాజు, కుమార్, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

వనదేవతలకు ముందస్తు మొక్కులు

(3వ పేజీ తరువాయి)

చేరుకున్నారు. అందరిని చల్లగా చూడాలని వేడుకున్నారు.

మొక్కులు చెల్లించుకున్న బండ్ల గణేష్

మేడారం సమ్మక్క-సారలమ్మలను సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ కుటుంబ సమేతంగా దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు గిరిజన సంప్రదాయాల ప్రకారం డోలువాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. అమ్మవార్లకు గణేష్ నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని వనదేవతలను కోరుకున్నానని, తన ఆకాంక్ష నెరవేరడంతో మొక్కులు చెల్లించుకున్నారని తెలిపారు.

దర్శించుకున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ మేడారం వనదేవతలను దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు,చీర, కొబ్బరికాయలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క-సారలమ్మల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఎన్‌సీఆర్‌సీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కరీమాబాద్, జనవరి 7 : ఎన్‌సీఆర్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. వరంగల్ శివనగర్‌లోని రామాలయంలో నిర్వహించిన పోటీల్లో మహిళలు ఆసక్తిగా పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేశారు. ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ దేవ సాంబమూర్తి, జనరల్ సెక్రెటరీ రామ్‌రెడ్డి, వైస్ చైర్మన్ జి.ప్రభాకర్, ధనుంజయ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ టి.వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జగదీష్, పీఆర్‌వో రాజన్న, సభ్యులు శ్రీదేవి, శైలజ, శంకర్ పాల్గొన్నారు.



నగరంలోని ఏవీవీ కళాశాలలో ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్లు



ముగ్గులను పరిశీలిస్తున్న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ బృందం



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు



ముగ్గులు వేస్తున్న యువతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



ముగ్గులను పరిశీలిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



ముగ్గుల పోటీల స్పాన్సర్స్ లోగోలు వేస్తున్న యువతులు



ముగ్గు వేస్తున్న మహిళా కానిస్టేబుళ్లు



ముగ్గు వేస్తున్న మహిళ



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL సోమవారం 8 జనవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

ఎయిడ్స్ నివారణకు కలుషితమైన రక్తమార్పిడిని అరికట్టాలి



ఎయిడ్స్ నివారణపై ప్రచారం నిర్వహిస్తున్న కళా రంజని సందీప్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

నెక్కొండ, జనవరి 7 : ఎయిడ్స్ వంటి భయంకరమైన వ్యాధి కలుషితమైన రక్త మార్పిడి, రక్షణలేని సెక్స్, శుద్ధిచేయని సిరంజీల వాడకం వలన సోకుతుందని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు మేనేజర్ శాంతరాజ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఆదివారం నెక్కొండ రైల్వే స్టేషన్‌లో కళాకారులచే అవగాహన ప్రదర్శన, ఎయిడ్స్ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధిని ఆరికట్టడానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అవుట్ రిచ్ వర్కర్ రేణుక, లక్ష్మి, విజయ్, కళాకారులు కరుణాకర్, శంకర్ , రజని, ప్రవళిక పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులే కీలకం

- యాసంగిలో సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- విత్తనాల ఎంపిక, యాజమాన్యంపై అధికారుల సూచనలు

రాయపర్తి, జనవరి 7 : ప్రస్తుత యాసంగిలో అధిక శాతం రైతులు లావు గింజల వరి సాగునకు మొగ్గు చూపుతున్నారు. ఈ మేరకు రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి పొందొచ్చని రాయపర్తి మండల వ్యవసాయ అధికారి వీరభద్రం సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు నీటి లభ్యతను దృష్ట్యా స్వల్పకాలిక రకాలైన బతుకమ్మ, ఎంటీయూ 1010, కేఎన్‌ఎం 118, ఆర్‌ఎన్‌ఆర్ 10754 రకం వరి సాగు మేలని తెలిపారు. చలి తీవ్రత ఆధారంగా పంట కాలం 10నుంచి 15 రోజుల్లో పెరిగే అవకాశమున్నందున, ఆ ప్రభావం నారుమడులపై పడకుండా రైతులు ప్రత్యేక యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. తద్వారా నేరుగా వరి విత్తే విధానంతో ఖర్చు తగ్గుతుందని తెలిపారు.

- ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు..

చలిని తట్టుకునే రకాలను రైతులు ఎంపిక చేసుకోవాలి. నారుమడిలో మండే కట్టే విధానం పాటించాలి. నారు పోసుకునే ముందు నారుమడిలో సరిపడా రెండు క్వింటాళ్ల పశువుల ఎరువు, కేజీ జింక్ సల్ఫేట్‌ను తప్పనిసరిగా తీసుకోవాలి. రాత్రి పూట నారు మడిలో నీరు లేకుంటే చలి ప్రభావం మొక్కలపై తక్కువగా ఉంటుంది. అందువల్ల ప్రతీ రోజు ఉదయం, పగటి పూట వెచ్చని బోరు నీటిని నారుమడికి అందించి సాయంత్రం వేళలో తొలగించాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడూ నారుమడి చుట్టూ అడుగు ఎత్తులో పల్చని పాలిథిన్ షీట్ లేదా ఖాళీ ఎరువుల సంచుల పట్టాలను సాయంత్రం కప్పి ఉదయం తీసివేయాలి. రాత్రి ఉష్ణోగ్రత 10డిగ్రీల సెల్సియస్ కంటే తగ్గినప్పుడు చలి తీవ్రత పెరిగి నారు ఎర్రబడంతో పాటు పోషక లోపం, జింక్ లోపం లక్షణాలు కనిపిస్తాయి. జింక్ లోపం కారణంగా ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడితే లీటర్ నీటికి 2గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగు బారి నుంచి నారును కాపాడుకోవడానికి నారు తీయడానికి వారం ముందు ఐదు సెంట్ల నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేయాలి. చలి తీవ్రతతో అగ్గి తెగులు ఆశించే అవకాశముందన్న ముందు జాగ్రత్తగా లీటర్ నీటికి 0.6 గ్రా. ట్రైసైక్లోజోన్‌ను కలిపి పిచికారీ చేయాలి.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం



సిబ్బందికి సూచనలు ఇస్తున్న మునిసిపల్ కమిషనర్ జోనా

వర్ధన్నపేట, జనవరి 7 : ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం కోసం బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్ జోనా సందర్శించి పర్యవేక్షించారు. ఇప్పటి వరకు ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేశారు, ఇంకా ఎన్ని చేయాల్సి ఉందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

- చెన్నారావుపేట : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన అభయ హస్తం ప్రజా పాలనలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని అధికారులు శనివారం రాత్రి ప్రారంభించారు. మండలంలోని 30 గ్రామాల్లో డిసెంబర్ 28 నుంచి జూన్ 6 వరకు 12,944 దరఖాస్తులను ప్రజల నుంచి స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలిస్తూ మగ్ధుంపురం గ్రామంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో 15 మంది డాటా ఎంట్రీ అపరేటర్లతో దరఖాస్తులను అన్‌లైన్ చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఆదివారం తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీవో భారతి, ఎంపీవో శ్రీధర్‌రాజు పరిశీలించారు. డాటా ఎంట్రీ అపరేటర్‌లకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ స్వామి, టైపిస్టు రజిత తదితరులు పాల్గొన్నారు.
- దుగ్గొండి : గత నెల 28 నుంచి జనవరి 6 వరకు గ్రామాల్లో చేపట్టిన గ్రామ సభలలో 34 గ్రామ పంచాయతీల నుంచి 14,789 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. 12,908 నివాస గృహాలు ఉండగా, మూడు రకాల దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని పెర్కొన్నారు.

గ్రామాల్లో మార్మోగుతున్న శ్రీరామ నామం



నారక్కపేటలో ప్రజలకు అక్షింతలను అందజేస్తున్న భక్తులు

నల్లబెల్లి, జనవరి 7 : యావత్తు భారతదేశం ఎప్పుడెప్పుడని ఎదురుచూస్తున్న అయోధ్యలో శ్రీరాముల వారి విగ్రహా పతిష్ఠాపన కార్యాక్రమం ఈ నెల 22వ తేదీన జరగనుంది. దీంతో అయోధ్య రామ మందిర తీర్థట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామాల్లో వైభ వంగా అక్షింతల వితరణ జరుగుతోంది. గ్రామాల్లో భక్తులు ఘనంగా శోభయాత్ర ను కొనసాగిస్తున్నారు. భక్తులు పరమ పవిత్రంగా సాంప్రదాయ దుస్తువులను ధరించి శ్రీరామనామ జపంతో అక్షింతల వివరణ చేస్తున్నారు. గ్రామాల్లో ప్రతీ ఇంటికి అక్షింతలు చేరేవిధంగా భక్తులు నిరంతరం అక్షింతల కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో పనిచేస్తున్నారు.

దేవాలయాల్లో రామ సంకీర్తన లు, రామభజనలు ఆలపించి, ప్రత్యేక పూజలు చేస్తు న్నారు. అయోధ్య అక్షింతలు పట్టుకొని ఇంటింటికి తిరిగి పంచే అవకాశం రావడం నిజంగా పూర్వ జన్మ సుకృతంగా భక్తులు భావిస్తున్నారు.

- **అక్షింతలు ఏం చేయాలి?**

ఇంటికి వచ్చిన అక్షింతలను వృద్ధి చేసుకొని దేవుని పూజ మంధిరంలో పెట్టుకోవచ్చు. లేదా, మన ఇంట్లో ఉన్న అక్షింతల్లో కలపవచ్చు. దీంతో మన ఇంట్లో శుభపరి మాణం జరుగుతోంది. అయోధ్య అక్షింతల వల్ల శ్రీరాముడి అనుగ్రహం వృద్ధి చెంది, ఇంటిల్లిపాది వ్యక్తులకు అంతా మంచే జరుగుతోందని ఒక ఉదారమైన నమ్మకం లేదా విశ్వాసం.

- **అక్షింతల వినియోగం ఎలా?**

2024 జనవరి 22న అయోధ్యలో శ్రీబాల రాముల వారి విగ్రహా ప్రతిష్ఠాపన జర గుతున్న సమయంలో ఇంటిల్లిపాది, ఇండ్లను నీటితో శుభ్రంగా కడుక్కోవడం, తల స్నానం చేయడం, గ్రామంలోని దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేయడం మంచి పరిణామని భక్తుల నమ్మకం. అలాగే అక్షింతలతో భర్త దీవెనలను తీసుకోవడం, లేదా బీరువాలో అక్షింతలను భద్రంగా ఉంచడం, పెళ్లి లేదా శుభాకార్యాల్లో, ఉద్యోగ ప్రమోషన్‌లో కూడా ఈ అక్షింతలను వినియోగించడం వల్ల అంతా మంచే జరుగుతోందని భక్తుల అపార నమ్మకం.

- **అక్షింతల వితరణ పూర్వజన్మ సుకృతం**

మార్త మార్కండేయ, అయోధ్య తీర్థ ట్రస్ట్ మండల ఇన్‌చార్జి, నల్లబెల్లి



అయోధ్య అక్షింతలను మా చేతులతో పట్టుకొని ఇంటింటికీ పంచే అవకాశం రావడం నిజంగా పూర్వ జన్మ సుకృతం. అలాగే గ్రామాల్లో శ్రీరాముడి విశిష్ట తను మరోసారి ప్రజలకు తెలియజేసి అక్షింతలు అందజేస్తుంటే మంచి స్పందన వస్తుంది నిజంగా దైవసేవా కార్యక్రమాలు చేయడం వల్ల మనస్సు అత్యంత పరమ పవిత్రంగా ఉంది. ఆయా అనుభూతి వెలకట్టలేనిది. గ్రామాల్లో అంతా శ్రీరామనామంతో జల్విస్తుంది.

- **రాముడే మా ఇంటికి వచ్చినట్లు అనుభూతి కలుగుతోంది**

తడుక వినయ్, భక్తుడు, నల్లబెల్లి



అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను కళ్ళకు అద్దుకొని చూస్తుంటే శ్రీరాముడే మా ఇంటికి వచ్చినట్లు ఉంది. అలాగే పలు గ్రామాల్లో అక్షింతలను వితరణ చేస్తుంటే శ్రీరామ నామం ప్రజ్వలిస్తుంది. అక్షింతలను ఇంటిలో జాగ్రత్తగా ఉంచుకోవడం వల్ల పుణ్యంతో పాటు, మంచి జరుగుతుంది. శ్రీరాముని జపంతో ప్రతీ ఇల్లు ఒక అయోధ్య కావాలి. అప్పుడే అయోధ్యలోని శ్రీరాముడు మన ఇంటికి వచ్చిన అనుభూతి కలుగుతుంది.

ఇంటింటికి శ్రీరాముడి అక్షింతల వితరణ



వర్ధన్నపేటలో శ్రీరాముడి అక్షింతలు అందజేస్తున్న మహిళలు



పాతమగ్ధుంపురంలో అక్షింతలతో వెళ్తున్న గ్రామస్థులు

వర్ధన్నపేట, జనవరి 7 : అయోధ్య శ్రీరాముడి అక్షింతలను వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం వర్ధన్నపేట మెయిన్ రోడ్‌కు ఇరువైపులా మహిళలు శ్రీరామ అక్షింతలను ఉదయం నుంచి సాయంత్రం వరకు వితరణ చేశారు. అయోధ్య రామ జన్మభూమి నుంచి వచ్చిన అక్షింతలను ప్రతి ఇంటికి భక్తి శ్రద్ధలతో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- చెన్నారావుపేట : మండలంలోని పాతమగ్ధుంపురం గ్రామంలో ఇంటింటికి శ్రీరామ జన్మభూమి పూజిత అక్షింతల వితరణను శనివారం రాత్రి గ్రామస్థులు, హనుమాన్ భక్తులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో బాలరాముని విగ్రహా ప్రతిష్ఠ ఉందని, ఆదే రోజు సాయంత్రం ప్రతీ ఒక్కరు ఇంటికి 5 దీపాల చొప్పున వెలిగించాలన్నారు. ఇంటింటి విద్యుత్ దీపాలతో అలంకరించుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ ఇంటిని శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందు పరిషత్ సభ్యులు ముల్క ఐలయ్య మాజీ ఉప సర్పంచ్ ననుమాస కర్ణాకర్‌గౌడ్. కొండపర్తి కృష్ణమోహన్, సాంబయ్య, చంద్రయ్య, గోదాదేవి, రాధిక, వీరస్వామి, దివ్యజ్యోతి, భాస్కర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ పార్టీల ఐక్యత జాతీయ మహా సభలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

చెన్నారావుపేట, జనవరి 7 : విప్లవ పార్టీల ఐక్యత జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు అన్నారు. ఆదివారం మండలంలోని ఈర్యతండాలో సీపిఐ (ఎంఎల్) పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ చేస్తున్న కుల, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు. మూడు విప్లవ పార్టీలు మార్చి నెలలో 3 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహాసభలను జయప్రదం చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలను చిత్త శుద్ధితో చేపట్టాలన్నారు. ప్రజాస్వామికదేశ హక్కుల రక్షణ, సంపద ప్రమాదకరంగా మారిందన్నారు. విప్లవకారులందరూ ఈ మహా సభలకు వేలాది మంది తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, రాజిరెడ్డి, నవ్య, కమ్మి, ఈరమ్మ, జంపన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ముత్యాల ముగ్గుల ఫొటోలు



వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో జరిగిన ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ



ముగ్గులను పరిశీలిస్తున్న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ బృందం



ముగ్గులు వేస్తున్న యువతులు,



మహిళా కానిస్టేబుళ్లు



ముగ్గులను పరిశీలిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

బాధిత కుటుంబానికి పరామర్శ



ఇల్లందలో సాంబయ్యను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే రమేష్

వర్ధన్నపేట రూరల్, జనవరి 7 :మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన మాజీ మంత్రి వ్యక్తిగత సహాయకుడు బేతి సాంబయ్య తల్లి బేతి సుశీల అనారోగ్యంతో మృతి చెందగా, ఆదివారం ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా సుశీల చిత్రపటానికి నివాళులర్పించారు. వీరి వెంట ఎంపీపీ అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ కన్నా, ఏఎంసీ చైర్మన్ స్వామిరాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమార స్వామి, సర్పంచ్ సుంకరి సాంబయ్య ఎంపీటీసీలు గొడిశాల శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు అంబటి ఎల్లస్వామి, ఉపసర్పంచ్ రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

గురువుకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

చెన్నారావుపేట, జనవరి 7 : మండలంలోని ఎల్లాయిగూడెం గ్రామానికి చెందిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుండగా ఆదివా రం భోద మాణిక్యంతండాకు చెందిన పూర్వ విద్యార్థులు కలిసి బియ్యంతో పాటు ఆర్థిక సాయంను అందించారు. ఈ కార్యక్రమంలో బోడ వెంకన్న, బోడ రవి, భూక్య నరేందర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



పద్మ (ఫైల్)

పర్వతగిరి, జనవరి 7 : పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చింతనెక్కొండలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... నెక్కొండకు చెందిన గంద్ర కోట లక్ష్మయ్య కూతురు పద్మ(25)ను పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండ గ్రామానికి చెందిన పనికెర రంజిత్‌కు ఆరేళ్ల క్రితం కట్న కానుకలు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు పిల్లలు కలిగిన అనంతరం అత్తింటివారి వేధింపులు ఎక్కు వయ్యాయి. ఈ విషయంపై గతంలో పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు సైతం జరిగాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం భర్త, అత్తింటివారు పద్మతో గొడవ పెట్టుకున్నారు. అనంతరం వారు వ్యవసాయభూమి వద్దకు వెళ్లడంతో పద్మ ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ఎంజీఎం ఆస్పత్రికి తీసుకుని వెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కాగా, ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతామని ఎస్సై వీరభద్రరావు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు



గాయపడిన నక్క రాజాలు

వర్ధన్నపేట, జనవరి 7 : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది.వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన నక్క రాజాలు అనే వ్యక్తి వ్యవసాయ పనుల కోసం ఎరువుల షాపునకు వెళ్లి యూరియా బస్తా కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అంబేద్కర్ కూడలిలో సూర్యపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వరంగల్ వెళుతూ రోడ్డు క్రాస్ చేస్తున్న ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. దీంతో నక్క రాజాలు కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని వెంటనే స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వర్ధన్న పేట పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేస్తే చాలా వరకు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నవోదయ మాక్ టెస్ట్

నర్సంపేట టౌన్, జనవరి 7 : నర్సంపేట పట్టణంలోని గీతాంజలి డీజీ పాఠశాలలో నవోదయలో సీటు సాధించేందుకు విద్యార్థులను ప్రోత్సహించేలా ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి నవోదయ మాక్ టెస్ట్‌ను నిర్వహించారు. మాక్ టెస్ట్‌లో అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు రూ.3వేలు, రూ.2వేలు, వెయ్యి రూపాయల నగదును అందజేశారు. అలాగే పరీక్షలో పాల్గొన్న 25 మంది విద్యార్థులకు షీల్డులను అందజేశారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, ప్రిన్సిపాల్స్ ప్రవీన్, సౌజన్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వనదేవతలకు ముందస్తు మొక్కులు

(3వ పేజీ తరువాయి)

చేరుకున్నారు.అందరిని చల్లగా చూడాలని వేడుకున్నారు.

- **మొక్కులు చెల్లించుకున్న బండ్ల గణేష్**

మేడారం సమ్మక్క - సారలమ్మ లను సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ కుటుంబ సమేతంగా దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు గిరిజన సంప్రదాయాల ప్రకారం డోలువాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. అమ్మవార్లకు గణేష్ నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించారు.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని వనదేవతలను కోరుకున్నానని, తన ఆకాంక్ష నెరవేరడంతో మొక్కులు చెల్లించుకున్నారని తెలిపారు.

- **దర్శించుకున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా**

మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ మేడారం వన దేవతలను దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీర, కొబ్బరికాయలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సమ్మక్క-సారలమ్మల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.